


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

అక్షర **రాజముద్ర**
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 10.05.2026 | సంపుటి: 3 | సంచిక: 98 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 10.05.2026 | VOLUME : 3 | ISSUE : 98 | PAGES: 8 | COST: 2/- |




# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

- నగర జనాభాకు అనుగుణంగా వసతులు
- హైదరాబాద్‌లో త్రీ-లెవెల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్:**
ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా మౌలిక

మిగతా 2వ పేజీలో..

# సంజయ్ కు సన్ స్ట్రోక్!

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు
- సాయి భగీరథ్ పై మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు
- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం
- ప్రధాని మోదీ పర్యటన వేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి కొత్త చిక్కులు
- రూ. 5 కోట్లు డిమాండ్ చేశారంటూ కరీంనగర్‌లో భగీరథ్ రివర్స్ కంప్లైంట్
- గతంలోనూ ర్యాగింగ్ కేసు.. ఇప్పుడు పోక్సో..

**తెలంగాణ బ్యూరో, రాజముద్ర న్యూస్:**
నేడు ప్రధాన రాష్ట్ర పర్యట వేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కు కొడుకుతో తలనొప్పి మొదలయింది. తన కుమారుడు బండి సాయి భగీరథ్ చుట్టూ రాజకీయ సెగలు ముసురుకుంటున్నాయి. మైనర్ బాలికను లైంగికంగా వేధించాడన్న ఆరోపణలతో ఆయనపై హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదవ్వడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గతంలో యూనివర్సిటీలో తోటి విద్యార్థిపై దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్, ఇప్పుడు అంతకంటే తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కోవడం గమనార్హం. ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనకు వస్తున్న సమయంలో ఈ ఉదంతం వెలుగులోకి

మిగతా 2వ పేజీలో..

**బండి తనయుడి భగీరథ్‌పై పోక్సో కేసు** 2



# తమిళనాట కొత్త చరిత్ర!

- నేడు సీఎంగా విజయ్ గా తళపతి ప్రమాణ స్వీకారం
- చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో భారీగా ఏర్పాట్లు
- 120 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రత్యేక ఆహ్వానం
- మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం పార్టీలకు కేబినెట్‌లో చోటు

2





## నేడు హైదరాబాద్ కు ప్రధాని మోదీ రాక

- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్:**
భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ

మిగతా 2వ పేజీలో..

# బేటీ బచావో నినాదం ఎటు పోయింది?

- బండి సంజయ్ కొడుకుపై ఫోక్సో కేసు..
- ప్రధాని ఎందుకు స్పందించరు?
- బాధితురాలిపైనే రివర్స్ కేసులా?
- తెలంగాణలోనూ జంగిల్ రాజ్ సర్కారు..
- కాంగ్రెస్‌బీజేపీల మధ్య అసహ్యకర ఒప్పందం!
- మోదీ, రాహుల్‌లపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ విమర్శలు

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్ :**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన ఫోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ విషయంలో అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆయన ఎండగట్టారు. బాలిక పరిస్థితి...వారి కుటుంబం పైన జరుగుతున్న వేధింపులపై కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మీ 'బేటీ బచావో' కేవలం ఒక నినాదమేనా? కేంద్ర మంత్రి బండి

మిగతా 2వ పేజీలో..





## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

- ఆయనతోపాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం
- ప్రమాణం చేయించి గవర్నర్ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సీఎంలు హాజరు

4

# రాష్ట్రంలో పంట మార్పిడికి ఇదే సరైన సమయం

- వరి వద్దు.. ఉద్యాన పంటలకే మొగ్గు
- పంట మార్పిడిపై మంత్రి తుమ్మలకు రైతు కమిషన్ నివేదిక
- వొచ్చే మూడేళ్లలో 13 లక్షల ఎకరాల్లో పంట మార్పిడి లక్ష్యం
- కొత్తగా మరో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళిక
- కేంద్ర విత్తన చట్టంలో మార్పులు చేయాలి: మంత్రి తుమ్మల డిమాండ్

**హైదరాబాద్, మే 9 :**
రాష్ట్రంలో పంట మార్పిడి అవశ్యకతపై వ్యవసాయశాఖ కమిషన్ రూపొందించిన నివేదికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు శనివారం

మిగతా 2వ పేజీలో..





## 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని వేళల పెంపు

- భూముల ధరల సవరణ నేపథ్యంలో పెరిగిన రిజిస్ట్రేషన్ల డిమాండ్
- స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంపునకు ఆదేశం
- మంత్రి పొంగులేటి కీలక నిర్ణయం

2




## జీపీ కార్యదర్శుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్!

3

- 15వ తేదీలోగా ఆప్షన్ల సమర్పణకు అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా 1,213 కార్యదర్శి పోస్టులు ఖాళీ
- మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి బదిలీ అవకాశం
- అత్యధికంగా నల్గొండ జిల్లాలో 85 ఖాళీలు..

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్:**

## నాసిక్ టీసీఎస్ కేసుపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



- ఒవైసీ, ఇంతియాజ్ జలీల్‌పై ఆరోపణలు

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్:**
మహారాష్ట్రలోని నాసిక్ టీసీఎస్ కేసులో నిదాఖాన్ అరెస్టు నేపథ్యంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు కేవలం వ్యక్తిగత నేరం కాదని, దీని వెనుక భారీ కుట్ర ఉందని ఆరోపించారు.

మిగతా 3వ పేజీలో..




## మాజీ సీఎంగా పేరు మార్చుకున్న దీదీ

4

- ఎక్స్ బయోను అప్‌డేట్ చేసిన మమత

## పనివాళ్లుగా చేరి.. కోట్లు దోచేస్తున్న నేపాలీ ముఠాలు



3

- జూబ్లీహిల్స్‌లో వరుస ఘటనలతో కలవరపాటులో ప్రజలు



## ప్రధాని మోదీకి కవిత బహిరంగ లేఖ

**రాజముద్ర న్యూస్, హైదరాబాద్:**
కల్వకుంట్ల కవిత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, దేశంలో సామాజిక

మిగతా 3వ పేజీలో..

# సంజయ్ కు సన్ స్ట్రోక్!

మొదటిపేజీ తరువాయి

రావడం బీజేపీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**పేట్ బషీరాబాద్‌లో నమోదైన పోక్సో కేసు**

బాధితురాలి తల్లిదండ్రులు మేడ్చల్ జిల్లాలోని పేట్ బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించి సంచలన ఆరోపణలు చేశారు. తమ మైనర్ కూతురిని (17 ఏళ్లు) మొయినాబాద్‌లోని ఒక ఫామ్ హౌస్‌కు మరియు మరో రెండు ప్రాంతాలకు తీసుకెళ్లి, అక్కడ ఆమెకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపుల కారణంగా తమ కుమార్తె తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు మొదట కేసు నమోదులో తాత్సారం చేసినా, బాధితులు కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించడంతో బీఎన్ఎస్ 74, 75 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

**హనీట్రాప్ అంటూ భగీరథ్ ఎదురు దాడి**

అయితే, తనపై వచ్చిన ఆరోపణలను సాయి భగీరథ్ పూర్తిగా ఖండించారు. పేట్ బషీరాబాద్‌లో కేసు నమోదు కావడానికి ముందే ఆయన కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో తనపై హనీ ట్రాప్ కుట్ర జరుగుతోందని ఫిర్యాదు చేశారు. ఆ అమ్మాయి తనకు ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా పరిచయమైందని, తామిద్దరం కలిసి విజయవాడ, అరుణాచలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలకు వెళ్లామని ఆయన పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత ఆ



అమ్మాయిని వివాహం చేసుకోవాలని ఆమె తల్లిదండ్రులు తనపై ఒత్తిడి తెచ్చారని, అందుకు నిరాకరించడంతో రూ. 5 కోట్లు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేశారని భగీరథ్ ఫిర్యాదులో తెలిపారు. గతంలో భయపడి ఆ అమ్మాయి తండ్రికి రూ. 50 వేలు చెల్లించానని, కానీ ఇప్పుడు భారీ మొత్తం కోసం తనపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన వాదించారు.

**నేడు ప్రధాని మోడీ పర్యటన వేళ..**

ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న తరుణంలో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం రాజకీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పాటు, ఈ వ్యవహారంలో హనీట్రాప్, రూ. 5 కోట్ల బ్లాక్‌మెయిల్ కోణాలు వెలుగులోకి రావడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలోనూ సాయి భగీరథ్ ర్యాగింగ్ కేసుల్లో చిక్కుకోవడం, ఇప్పుడు ఏకంగా పోక్సో వంటి తీవ్రమైన కేసు నమోదు కావడంతో ప్రధాని పర్యటన వేళ బండి సంజయ్‌కు ఇది పెద్ద తలనొప్పిగా మారింది.

**పరువు పోతుందనే ఆందోళనలో బండి**

ఈ ఉదంతం ఇప్పటికే ఢిల్లీలోని బీజేపీ అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కీలక బాధ్యతల్లో ఉన్న బండి సంజయ్, తన సొంత కుమారుడిపైనే ఇటువంటి నేరారోపణలు రావడంతో అధిష్ఠానం పెద్దల వద్ద పరువు పోతుందనే ఆందోళనలో ఉన్నట్లు సమాచారం. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే ఈ పరిణామాలపై కేంద్ర పెద్దలు సీరియస్‌గా ఉన్నారని, దీనిపై పూర్తి స్థాయి నివేదికను కోరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కేంద్ర మంత్రి పదవికి రాజీనామా డిమాండ్**

ఈ ఉదంతం రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన బండి సంజయ్, నేరచరిత్ర కలిగిన తన కుమారుడిని ఇంట్లో పెట్టుకోవడం ఏంటని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సోషల్ మీడియాలో బండి సంజయ్‌ను తక్షణమే పదవి నుండి తప్పించాలనే డిమాండ్ ఊపందుకుంది. గతంలో ర్యాగింగ్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి కేంద్ర మంత్రి హోదాలో ఉన్న తండ్రి అండగా నిలుస్తున్నారని, ఇప్పుడు కూడా బాధితులపైనే ఎదురు కేసులు పెట్టించడం ద్వారా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పోలీసుల విచారణలో కీలక అంశాలు**

ప్రస్తుతం ఈ కేసులో పోలీసులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు, ఘటనా స్థలాల్లో లభించే ఆధారాలు, కాల్ డేటా మరియు ఇతర డిజిటల్ ఆధారాలను సేకరిస్తున్నారు. మరోవైపు కరీంనగర్ పోలీసులు భగీరథ్ ఫిర్యాదు మేరకు ఆ యువతి మరియు ఆమె తల్లిదండ్రులపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. రెండు వైపులా భిన్నమైన వాదనలు వినిపిస్తుండటంతో, అసలు ఇది పథకం ప్రకారం జరిగిన 'హనీట్రాప్' లేక ఒక మైనర్ బాలికపై జరిగిన దారుణమా? అనేది విచారణలో తేలాల్సి ఉంది.

## బండి తనయుడి భగీరథ్‌పై ఫోక్సో కేసు

- **మైనార్ బాలికపై అత్యాచారం జరిపినట్లు ఫిర్యాదు**

**హైదరాబాద్, మే 9 :**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ బీజేపీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వొస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. చివరికి గత అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు అనంతరం బండి సంజయ్ కొడుకు భగీరాథ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇంతకుముందు కూడా కాలేజీలో ఓ విద్యార్థిపై దాడి చేసి భగీరథ్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అయితే భగీరథ్‌పై పాత వివాదాల నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో చేసిన ట్వీట్ ఇప్పుడు మళ్లీ వైరల్‌గా మారింది. భగీరథ్‌ను ఇరాక్ మాజీ నియంత సద్దాం హుస్సేన్ కుమారుడు ఉదయ్ హుస్సేన్‌తో పోలుస్తూ ఆర్జీవీ అప్పట్లో చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచింది.

## బేటీ బచావో' నినాదం ఎటు పోయింది?

మొదటిపేజీ తరువాయి

సంజయ్ కుమారుడిపై మీరు ఎలాంటి చర్య తీసుకోబోతున్నారు? అతనికి మినహాయింపు ఉంటుందా? బండి సంజయ్ ఎప్పుడు రాజీనామా చేస్తారు లేదా మంత్రివర్గం నుంచి ఎప్పుడు బర్తరఫ్ చేయబడతారు? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

రాహుల్ గాంధీ, తెలంగాణలో మీ పార్టీ ఎలాంటి 'జంగిల్ రాజ్' నడుపుతోంది? ఒక మైనర్ బాలిక అన్ని ఆధారాలతో వచ్చినప్పుడు పోలీస్ శాఖ అత్యంత వేగంగా ఎందుకు స్పందించలేదని అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఇతర పోక్సో నేరస్తుల మాదిరిగానే కేసు నమోదు చేసి ఎందుకు విచారణ జరపడం లేదని అన్నారు. మైనర్ బాలికపైనే ఎదురు కేసు ఎందుకు పెట్టారు? ఉన్నావ్ కేసులో చేసినట్లుగా, రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలబడాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీకి ఒక ఫ్రాంచైజీలా పనిచేస్తోందని, ఒక మైనర్ బాలిక గౌరవం విషయంలో కాంగ్రెస్, బిజెపి ఒక అపవిత్రమైన, అసహ్యకరమైన ఒప్పందానికి వచ్చాయని మండిపడ్డారు.

ఒక 17 ఏళ్ల అత్యాచార బాధితురాలు, ఆమె కుటుంబం, ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడానికే మూడు నెలలకు పైగా ఎందుకు పోరాడాల్సి వస్తోందని ప్రశ్నించారు. మనం ఎంతటి దుర్భరమైన, భయంకరమైన నరకంలో జీవిస్తున్నామో ఆ కుటుంబం కష్టం చూస్తే అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిని ఆమె కుటుంబాన్ని నేరస్తుల్లా చూస్తూ ఎందుకు వేధిస్తున్నారని నిలదీశారు. ఆ మైనర్ బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. న్యాయం కోసం వారు మూడు నెలలుగా తిరుగుతున్నారు. ఇప్పుడు మీరు ఆమెనే నిందిస్తున్నారు. ఏ నిబంధన ప్రకారం తెలంగాణ పోలీసులు ఒక మైనర్ బాలికపై హనీట్రాప్, వసూళ్ల కేసు నమోదు చేశారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. మన మహిళల గౌరవం కోసం గతంలో అణచివేతదారులతో, ప్రభుత్వాలతో పోరాడామని ఇప్పుడు ఆడబిడ్డల రక్షణ కోసం అవసరమైతే మరో మిలియన్ సార్లు మళ్లీ పోరాడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు.


పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్ 2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు.

నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.

## నేడు హైదరాబాద్ కు ప్రధాని

మొదటిపేజీ తరువాయి

బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, మఫ్టీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో



ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు



## రాష్ట్రంలో పంట మార్పిడికి ఇదే సరైన సమయం

మొదటిపేజీ తరువాయి

సచివాలయంలో అందజేశారు.రాష్ట్రంలో ప్రస్తుతం రైతులు ప్రధానంగా వరి, పత్తి పంటలపై ఆధారపడుతున్న నేపథ్యంలో, ఉద్యాన పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల పంటల సాగును ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ కమిషన్ సమగ్ర నివేదిక రూపొందించింది.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (Minister Thummala Nageshwar Rao) మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 1.30 కోట్ల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, వొచ్చే మూడు సంవత్సరాల్లో అందులో కనీసం 13 లక్షల ఎకరాలను ఉద్యాన పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌సీడ్స్ సాగుకు మళ్లించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు.

పంట మార్పిడిలో మార్కెట్ లో డిమాండ్ ఉండే పంటలు సూచిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం వుంది కనుక అటువంటి పంటలు మరియు దేశ ప్రాంత అవసరాలు దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక చెయ్యాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఈ సంవత్సరంలో 45 వేల ఎకరాలలో కొత్తగా ఆయిల్ పామ్ సాగును తీసుకురాగా.. వచ్చే సంవత్సరంలో 1 లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రణాళిక తయారుచేసి, దానిని సాధించాలని అన్నారు. కేంద్రం తయారుచేసిన విత్తనచట్టంలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ చట్టంలో నకిలీ విత్తనాల వలన రైతులు నష్టపోతే, రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి స్పష్టత లేదన్నారు. విత్తన నియంత్రణలో కేంద్రంతో పాటు రాష్ట్రాలకు కూడా సముచిత అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వొచ్చే ఖరీఫ్ సీజన్ కి సంబంధించి జూన్ మొదటి వారంలో నాట్లు వేసే అవకాశాలు ఉన్నందున, మే నెలాఖరు వరకు రాష్ట్రంలో తగినంత యూరియా బఫర్ నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియా కేటాయింపులకు అనుగుణంగా కేంద్రం సరఫరా చేసేలా కేంద్ర అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నేరుగా కేంద్ర అధికారులను కలిసి, యూరియా సరఫరాలో జాప్యం జరగకుండా చూసేలా కోరాలని మంత్రి సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో తెలంగాణ రాష్ట్రానికి 90 శాతం కేటాయించి, సరఫరా చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి డిమాండ్ చేశారు. సమావేశంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మీన్ బాషా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని వేళల పెంపు

**హైదరాబాద్, మే 9 :**

రాష్ట్రంలో భూముల ధరల సవరణ నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపథ్యంలో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ల రద్దీ ఎక్కువగా ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని వేళలను పొడిగిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చు తగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అధిక రద్దీ ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్.ఓ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలను ఈ నెల 12వ తేదీ నుంచి పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పదిహేను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో అవసరమైతే మరింత సమయాన్ని పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

అదేవిధంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు. అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను కూడా సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, వేగం, ప్రజలకు సౌకర్యం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పనిచేస్తోందని దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు ను మంత్రి పొంగులేటి ఆదేశించారు.



# తమిళనాట కొత్త చరిత్ర!

**నేషనల్ బ్యూరో, మే 9:**

తమిళనాట ఒక కొత్త చరిత్ర లిఖించబడబోతోంది. వెండితెరపై అలరించిన రియల్ హీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ఇప్పుడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించబోతున్నారు. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి, ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ద్రవిడ పార్టీలను మట్టి కరిపించి విజయ్ ఈ ఘనత సాధించారు. తమిళ ఓటర్లు ఆయనకు అధిక మెజారిటీ కట్టబెట్టడంతో, రాష్ట్రంలో ఒక కొత్త నాయకత్వంలో ప్రభుత్వం కొలువుదీరనుంది.

**సంఖ్యా బలంపై ఉత్కంఠ.. చివరకు సుఖాంతం**

తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా, ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. విజయ్ పార్టీ టీవీకే 108 స్థానాల్లో విజయం సాధించింది. అయితే విజయ్ రెండు చోట్ల పోటీ చేసి గెలవడంతో, సాంకేతికంగా ఆయన పార్టీ బలం 107కు తగ్గింది. మ్యాజిక్ ఫిగర్‌కు కావాల్సిన సంఖ్యా బలం లేకపోవడంతో తొలుత గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వలేదు. దీంతో సంఖ్యా బలం నిరూపించుకునేందుకు విజయ్ రాజకీయ లెక్కలు ప్రారంభించారు.

**కూటముల మార్పు..**

**విజయ్ వైపు మొగ్గిన పార్టీలు**

ఈ సంక్షోభ సమయంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ డీఎంకే కూటమి నుండి బయటకు వచ్చి విజయ్‌కు మద్దతు ప్రకటించింది. అటు సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా తమ మద్దతును తెలిపాయి. కీలకమైన వీసీకే పార్టీ నేత తిరమావళవన్ మొదట ఉపముఖ్యమంత్రి పదవి కోసం పట్టుబట్టినప్పటికీ, చివరకు తమిళ ప్రజలకు స్థిరమైన పాలన అందించే ఉద్దేశంతో బేషరతు మద్దతు ప్రకటించారు. వీసీకే మద్దతుతో విజయ్ బలం 118కి చేరగా, ఐయూఎంఎల్ కూడా మద్దతు తెలపడంతో మొత్తం సంఖ్య 120కి చేరి ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

**రాహుల్ గాంధీకి ఆహ్వానం.. ప్రముఖుల రాక**

తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విజయ్ ఆహ్వానించారు. వీరితో పాటు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్, పళనిస్వామి వంటి రాజకీయ నాయకులకు, సినీ రంగంలోని ప్రముఖులకు టీవీకే నేతలు ఆహ్వానాలు పంపుతున్నారు. సుమారు 20 మంది మంత్రులతో విజయ్ తన కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. మద్దతు ఇచ్చిన నాలుగు పార్టీలకు కేబినెట్‌లో ప్రాధాన్యత కల్పించనున్నారు.

**ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు**

నేడు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి స్టేడియంలో ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంఖ్యా బలం



స్పష్టంగా ఉండటంతో గవర్నర్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో దేశం మొత్తం ఇప్పుడు తమిళనాడు వైపు, ముఖ్యంగా విజయ్ పట్టాభిషేకం వైపు ఆసక్తిగా చూస్తోంది.

# ప్రధాని మోదీకి కవిత బహిరంగ లేఖ

మొదటిపేజీ తరువాయి

న్యాయ సాధనకు సంబంధించిన నాలుగు కీలక అంశాలను తక్షణమే పరిగణలోకి తీసుకోవాలని ఆమె కోరారు.
ప్రధానమంత్రి మే 10న తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ లేఖను విడుదల చేశారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభలో మోదీ పాల్గొననున్నారు. తెలంగాణ ప్రజలకు, దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి సంబంధించి ముఖ్యమైన అంశాలను బాధ్యతగల పౌరురాలిగా మీ దృష్టికి తీసుకొస్తున్నానని కవిత లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నీటిపారుదల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కోరారు. 2027 జనాభా లెక్కల్లో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఓబీసీ ఉపకోటాతో తిరిగి ప్రవేశపెట్టాలని సూచించారు. తెలంగాణలో వెనుకబడిన తరగతుల బిల్లులకు రాష్ట్రపతి ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. జల భద్రత, డేటా ఆధారిత న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ రక్షణలు దేశ సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తాయని కవిత పేర్కొన్నారు. తాను చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## దసరాలోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్రే: రేవంత్ సర్కారుకు కవిత హెచ్చరిక

- **పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, మే 9:**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని టీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. దసరాలోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో పాదయాత్ర చేపడతామని ఆమె హెచ్చరించారు.
షాద్‌నగర్ నియోజకవర్గం చౌదరిగూడెం మండలం లక్ష్మీదేవిపల్లిలో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ'లో కవిత పాల్గొని మాట్లాడారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు.
ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలనే డిమాండ్‌ను కూడా ఆమె పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ నిధులు ఖర్చు చేసినా, ఆశించిన స్థాయిలో నీటి వినియోగం జరగలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని విమర్శించారు. "కృష్ణమ్మ పరవళ్లు తొక్కి ప్రవహిస్తున్నా ఆ నీటిని వినియోగించలేని పరిస్థితి నెలకొంది" అని కవిత వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని, దానిని సరిచేస్తామని తెలిపారు.
దసరాలోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో పాదయాత్ర చేపడతామని, ప్రతి నియోజకవర్గంలో ప్రజలను కలుస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని ఆమె హెచ్చరించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. పాలమూరు ప్రజలకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

## నాసిక్ టీసీఎస్ కేసుపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు


మొదటిపేజీ తరువాయి



నాసిక్ టీసీఎస్ కుట్ర వెనుక ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పాటు మాజీ ఎంపీ ఇంతియాజ్ జలీల్ హస్తం ఉందని రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఉగ్రవాద మూలాలున్న అంశాల్లో ఎవరినీ వదిలిపెట్టకూడదని వ్యాఖ్యానించారు. ఒవైసీ, ఇంతియాజ్ జలీల్‌లను వెంటనే అరెస్ట్ చేసి విచారణ చేపట్టాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. దేశ భద్రత విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ఒవైసీ సోదరులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తే ఆయన రాజకీయ భవిష్యత్తుకు ముప్పు తప్పదని హెచ్చరించారు. గతంలో ఒవైసీలతో సన్నిహితంగా ఉన్న నాయకులు రాజకీయంగా నష్టపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక బీజేపీ నేతలకు కూడా రాజాసింగ్ సూచనలు చేశారు. ఎవరైనా బీజేపీ నేతలు ఒవైసీని రహస్యంగా కలిస్తే అది పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

## పాట్నా ఐఐటీ క్యాంపస్‌లో హైదరాబాద్ విద్యార్థి మృతి

- **క్రికెట్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు స్తంభానికి తాకడంతో విద్యుదాఘాతం**
- **మృతుడిని చందానగర్‌కు చెందిన హర్షిత్ రాజ్‌గా గుర్తింపు**
- **తల్లిదండ్రులకు సమాచారం అందించిన పోలీసులు**



**హైదరాబాద్, మే 9:**

బీహార్ లోని పాట్నా ఐఐటీ క్యాంపస్‌లో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతుండగా ప్రమాదవశాత్తు స్తంభాన్ని తాకడంతో కరెంట్ షాక్ కు గురై ప్రాణాలు విడిచాడు. మృతుడిని నగరంలోని చందానగర్‌కు చెందిన హర్షిత్ రాజ్‌గా గుర్తించారు. ఈరోజు ఉదయం ఆరు గంటలకు ఈ విషాద ఘటన చోటు చేసుకున్నట్లు ఐఐటీ పాట్నా సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ దీపక్ కుమార్ చౌరాసియా నగర పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్రికెట్ ఆడుతూ విద్యార్థి విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయినట్లు పోలీసులు తెలిపారు. వెంటనే అతనిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. విద్యార్థి తల్లిదండ్రులకు, స్థానిక పోలీసులకు ఐఐటీ పాట్నా అధికారులు సమాచారం ఇచ్చారు.

# జీపీ కార్యదర్శుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్!

**తెలంగాణ బ్యూరో, మే 9:**




రాష్ట్రంలో చాలా కాలంగా ఎదురుచూస్తున్న పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కీలక ఆదేశాలు జారీ చేస్తూ, బదిలీలు కోరుకునే వారు ఈ నెల 15వ తేదీలోగా తమ ఆప్షన్లను అందజేయాలని స్పష్టం చేసింది.

**బదిలీలకు అర్హతలు ఇవే..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో మూడేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న కార్యదర్శులు బదిలీలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ పరిధిలోకి వచ్చేవారు, భార్యాభర్తలు ఒకే చోట పనిచేయాలని కోరుకునే వారు (స్పౌజ్ కేటగిరీ), అలాగే వ్యక్తిగత కారణాల రీత్యా బదిలీ కావాలనుకునే వారు నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లా అధికారులు ఈ దరఖాస్తులను స్వీకరించి, ధ్రువీకరించిన తర్వాత 15వ తేదీ సాయంత్రం లోపు కమిషనర్ కార్యాలయానికి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.

**జిల్లాల వారీగా ఖాళీల వివరాలు**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,760 గ్రామ పంచాయతీల్లో 2026 మే 1 నాటికి మొత్తం 1,213 పంచాయతీ కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. నల్గొండ జిల్లాలో అత్యధికంగా 85 పోస్టులు ఖాళీగా ఉండగా, కుమ్రంభీం జిల్లాలో 78, కామారెడ్డిలో 68, జనగామలో 64 ఖాళీలు ఉన్నాయి. సంగారెడ్డిలో అత్యల్పంగా 12 ఖాళీలు ఉండగా, హన్మకొండ, వరంగల్, మంచిర్యాల జిల్లాల్లో 14 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అసలు గ్రామ పంచాయతీలే లేనప్పటికీ, అక్కడ 18 ఖాళీలు చూపించడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.


**జోన్ల వారీగా పోస్టుల లభ్యత**


బదిలీల ప్రక్రియ కోసం జోన్ల వారీగా ఖాళీలను ప్రభుత్వం ప్రకటించింది. యాదాద్రి జోన్‌లో అత్యధికంగా 258 ఖాళీలు ఉండగా, రాజన్న సిరిసిల్ల జోన్‌లో 216, కాళేశ్వరం జోన్‌లో 208 ఖాళీలు ఉన్నాయి. భద్రాద్రి జోన్‌లో 164, జోగులాంబ జోన్‌లో 160, బాసర జోన్‌లో 126 పోస్టులు ఉండగా, చార్మినార్ జోన్‌లో అత్యల్పంగా 81 ఖాళీలు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేస్తోంది. బదిలీల ప్రక్రియ ప్రారంభం కావడంతో పంచాయతీ కార్యదర్శుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# పనివాళ్లుగా చేరి.. కోట్లు దోచేస్తున్న నేపాలీ ముఠాలు

**హైదరాబాద్, మే 9:**

నగరంలోని సంపన్నులు నివసించే జూబ్లీహిల్స్, నందగిరి హిల్స్ ప్రాంతాల్లో వరుస హత్యలు, దోపిడీ ఘటనలు కలకలం రేపుతున్నాయి. పని మనుషులుగా ఇళ్లలో చేరుతున్న కొందరు నేపాలీలు విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తూ భారీ చోరీలు, హత్యలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలుతోంది. గత మూడు నెలల్లో జరిగిన మూడు ప్రధాన ఘటనలు నగర ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయి.
ఫిబ్రవరి 6న నందగిరి హిల్స్‌లో ఓ వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న భూపిందర్ షా అనే నేపాలీ యువకుడు ఇతర పనివారికి మత్తుమందు ఇచ్చి సుమారు రూ.2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారైన ఘటన సంచలనం సృష్టించింది. అనంతరం మార్చి 14న జూబ్లీహిల్స్‌లో మరో వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న ఇద్దరు నేపాలీలు యజమాని లేని సమయంలో లాకర్లు పగులగొట్టి రూ.3 కోట్ల విలువైన నగలను దోచుకెళ్లారు. తాజాగా మే 8న విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువతి యజమాని భార్యను హత్య చేసి నగదు, బంగారు ఆభరణాలతో పరారైన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ మూడు ఘటనల వెనుక ఒకే ముఠా హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.
దర్యాప్తులో భాగంగా నిందితుల పనితీరుపై కీలక విషయాలు బయటపడుతున్నాయి. ముందుగా ధనిక కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని పనివాళ్లుగా ఇళ్లలో చేరుతున్న ముఠా సభ్యులు, కొన్ని వారాల పాటు నమ్మకంగా పనిచేస్తూ ఇంట్లోని పరిస్థితులు, నగదు, నగల నిల్వలపై సమాచారం సేకరిస్తున్నట్లు గుర్తించారు. యజమానులు బయటకు వెళ్లిన సమయంలో తమ అనుచరులతో కలిసి దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.
ఈ కేసుల్లో అరెస్టయిన నిందితులను విచారించగా, నేపాల్‌లో ఉన్న కొందరు మాస్టర్‌మైండ్‌లు ఈ ముఠాలను నడిపిస్తున్నట్లు సమాచారం లభించింది. పనికి వెళ్లే వ్యక్తుల ఎంపిక నుంచి, దోపిడీ అనంతరం పోలీసులకు చిక్కకుండా ఎలా తప్పించుకోవాలన్న దానివరకు మార్గనిర్దేశం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దోచుకున్న సొత్తుతో పుణె, ముంబై నగరాల్లో తలదాచుకుంటున్నట్లు అనుమానిస్తున్నారు. గతంలో నగర పోలీసులకు సవాల్‌గా మారిన రాజస్థాన్‌కు చెందిన 'ముఖియా గ్యాంగ్' తరహాలోనే ఇప్పుడు నేపాలీ ముఠాలు కొత్త తలనొప్పిగా మారాయి. నిందితులు నేపాల్‌కు పారిపోతే వారిని తిరిగి తీసుకురావడం అంతర్జాతీయ నిబంధనల కారణంగా క్లిష్టమవుతోందని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ, ఈ ముఠాలను పట్టుకునేందుకు నగర పోలీసులు 'ఆపరేషన్ నేపాల్' పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.





## హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకున్న చంద్రబాబు కాన్వాయ్

- **మోదీ పర్యటన ట్రయల్ రన్‌తో బంజారాహిల్స్ లో గందరగోళం**

**హైదరాబాద్, మే 9:**

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో నిర్వహించిన భద్రతా ట్రయల్ రన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాన్వాయ్ హైదరాబాద్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. శనివారం బంజారాహిల్స్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.
వివరాల్లోకి వెళితే, ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు బంజారాహిల్స్ మార్గంలో కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ కూడా ఆ మార్గంలో రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. కమ్యూనికేషన్ లోపం కారణంగా ముందస్తు సమాచారం లేకపోవడంతో వాహన శ్రేణి ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది.
సుమారు 10 నిమిషాల పాటు ట్రాఫిక్‌లోనే కాన్వాయ్ నిలిచిపోయింది. ట్రాఫిక్ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తన వాహనం నుంచి కిందకు దిగినట్లు సమాచారం. వెంటనే భద్రతా సిబ్బంది ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు.కొద్దిసేపటి తర్వాత ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంతో చంద్రబాబు కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు సాగింది. ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపమే ఈ పరిస్థితికి కారణమైందని తెలుస్తోంది.

## హైదరాబాదులో 15 లక్షల టన్నుల 'చెత్త' కొండ

- **హైదరాబాద్ గచ్చిబౌలిలో 15 లక్షల టన్నుల నిర్మాణ వ్యర్థాలు**
- **ఐకియా సమీపంలో ఆరంతస్తుల ఎత్తులో పేరుకుపోయిన చెత్త**
- **తొలగింపునకు ఏడాదికి పైగా సమయం పట్టే అవకాశం**
- **పరిష్కారానికి రూ.70 నుంచి రూ.90 కోట్ల వరకు ఖర్చు అంచనా**
- **ప్రధాన అడ్డంకిగా మారిన భూ వివాదం**



**హైదరాబాద్**

హైదరాబాదులో 15 లక్షల టన్నుల చెత్త కొండ ఎక్కడుందో తెలుసా? అది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు, హైటెక్ హంగులతో నిత్యం మెరిసిపోయే గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లోనే ఉంది. ఐకియా స్టోర్‌కు సమీపంలో, ఆకాశహర్మ్యాల మధ్య పేరుకుపోయిన ఈ నిర్మాణ వ్యర్థాల (C&D) గుట్టలు ఇప్పుడు నగరం ముందున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా నిలిచాయి. కొన్నేళ్లుగా ఇక్కడ పేరుకుపోయిన ఈ వ్యర్థాలు దాదాపు ఆరు నుంచి ఏడు అంతస్తుల ఎత్తుకు చేరాయి. రోజూ వేలమంది ప్రయాణించే ఈ మార్గంలో ఇవి సాధారణ దృశ్యంగా మారాయి. అధికారుల అంచనా ప్రకారం, ఈ 15 లక్షల టన్నుల చెత్తను తొలగించడానికి, అనువైన పరిస్థితుల్లో కూడా ఏడాదికి పైగా సమయం పట్టవచ్చు.ఈ సమస్య పరిష్కారానికి రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి. సృజన తెలిపారు. మొదటిది, వ్యర్థాలను అక్కడికక్కడే ప్రాసెస్ చేసి, ఇసుక వంటి నిర్మాణ సామగ్రిగా మార్చడం. ఇది పర్యావరణానికి మంచిదైనా, చాలా నెమ్మదైన ప్రక్రియ. రెండోది, చెత్తను వేరే ప్రాంతానికి తరలించడం. ఇది వేగంగా పూర్తయినా, రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో భారీ వాహనాలతో తరలించడం అత్యంత క్లిష్టమైన పని. ఈ మొత్తం ప్రక్రియకు రూ.70 కోట్ల నుంచి రూ.90 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అయితే, దీనికి ప్రధాన అడ్డంకిగా భూ వివాదం మారింది. వ్యర్థాలున్న ఈ స్థలంపై ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు శాశ్వత చర్యలు తీసుకోవడం కష్టమని, కోర్టు తీర్పు తర్వాతే స్పష్టత వస్తుందని కమిషనర్ వివరించారు.

# తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం

- **17 లైసెన్స్ సేవలు ఇక పూర్తిగా ఆన్‌లైన్‌లోనే**

**హైదరాబాద్, మే 9:**



తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ వాహనదారులకు భారీ ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన 17 రకాల సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొస్తూ 'ఫేస్‌లెస్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి వెల్లడించారు.
ఈ విధానం ద్వారా ఇకపై చిన్నచిన్న పనుల కోసం ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఆధార్ ధ్రువీకరణతో ఇంటి నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. సేవల్లో పారదర్శకత పెంచడం, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.
కొత్త విధానం కింద లెర్నర్ లైసెన్స్‌లో పేరు, చిరునామా, ఫొటో, సంతకం మార్పులు, డూప్లికేట్ లెర్నర్ లైసెన్స్ జారీ వంటి సేవలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, డూప్లికేట్ లైసెన్స్, లైసెన్స్ రీప్లేస్‌మెంట్, పుట్టిన తేదీ మార్పు, బయోమెట్రిక్ వివరాల సవరణ వంటి కీలక సేవలను కూడా ఫేస్‌లెస్ విధానంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రమాదకర వ్యర్థాల రవాణాకు అవసరమైన హజార్డస్ లైసెన్స్ ఎండార్స్‌మెంట్, డూప్లికేట్ పబ్లిక్ సర్వీస్ వెహికల్ (పీఎస్‌వీ) బ్యాడ్జ్ జారీ, లైసెన్స్ నుంచి వాహన విభాగాల తొలగింపు వంటి సేవలు కూడా ఆన్‌లైన్‌లోనే అందించనున్నట్లు అధికారులు తెలిపారు.
ప్రస్తుతం ఈ సేవలు 'సారథి' వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉండగా, త్వరలోనే 'నెక్స్‌ట్‌జెన్ ఎంపరివాహన్' మొబైల్ యాప్‌లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఎక్కడి నుంచైనా సేవలను వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.కార్యాలయాలపై పని భారం తగ్గించడంతో పాటు మధ్యవర్తుల ప్రమేయాన్ని నివారించి, ప్రజలకు సమయం, శ్రమ ఆదా చేయడమే ఈ ఫేస్‌లెస్ విధానం ప్రధాన ఉద్దేశమని రవాణా శాఖ స్పష్టం చేసింది.

# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

- ఆయనతోపాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం
- ప్రమాణం చేయించి గవర్నర్ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సీఎంలు హాజరు





**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్‌లో మొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహితుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు.గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.



సంపాదకీయం

# తమిళనాట భేతాళ ప్రశ్నలు?

తమిళనాట ప్రతిష్టంభనకు చిన్న పార్టీలు ఆడుతున్న పెద్ద డ్రామాలు కలుషిత రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. లెఫ్ట్ పార్టీలు, ముస్లిం పార్టీ సహా ఇతర చిన్న పార్టీలు ఒకటి అరా సీటు సంపాదించినా బేరాలాడుతున్న తీరు వల్ల తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు ఆటంకాలు వస్తున్నాయి. ఈ క్రమంలో తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. టీవీకేకు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్తవాలు బయటపడతా యన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుండటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవాలని సూచించింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించింది. రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించా లని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందే నన్నారు. ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులు పడుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. ప్రజా తీర్పును వమ్ము చేసేలా చిన్న పార్టీలు దోబూచులాడు తున్నాయి. మద్దతుకు ఓకే చెప్పి గవర్నర్‌కు లేఖలు అందించడంలో వెనక్కి తగ్గాయి. దీంతో మెజార్టీ విషయంలో గవర్నర్ సంతృప్తి చెందక పోవడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అధికారం పొందడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కు కేవలం పదకొండు స్థానాలు తక్కువ. ఇటువంటి పరిస్థితిలో అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నేతను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడం అన్నది కేవలం ఆనవాయితీ మాత్రమే. గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపికి నాటి రాష్ట్రపతి అటువంటి అవకాశం ఇవ్వడం 13 రోజుల్లో మెజారిటీ ర-ుజువు చేసుకోలేక వాజ్‌పేయి రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే! దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ ఇటువంటి దృష్టాంతాలెన్నో జరిగాయి. అయితే ప్రమాణానాఇకి ముందు మద్దతు లేఖలతో సం÷-యా బలం తెలుసుకోవడం గవర్నర్ విధి. దీనిని ఎవ్వరూ తప్పు పట్టాల్సిన పనిలేదు. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీకి మె.ఆర్టీ సీట్లు కట్టబెట్టారు. ఫలితాలు వచ్చిన మరునాడే అతి పెద్ద పార్టీగా వచ్చిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని గవర్నర్ ఆహ్వానిస్తూనే మద్దతు లేఖలు కోరారు. అయితే విజయ్ కూడా ఈ విషయంలో కొంత డ్రామాలు ఆడుతున్నట్లుగా ఉంది. అయిదు సీట్లున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీకి అవసరమైన మద్దతు మాత్రం చూపడం లేదు. తమిళ ప్రజా తీర్పును అమలు చేయడానికి తమిళనాట గందరగోళం సృష్టించాలని తమిళ పార్టీలే యత్నిస్తున్నాయి. వామపక్షాలు బేషరతు నిర్ణయం తీసుకొని టివికె ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి. విసికె మద్దతు లేఖ ఇస్తే మేజిక్ ఫిగర్ చేరుకోవడం సులువవుతుంది. ఈ క్రమంలో తమిళనాడులో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా ప్రతిష్టంభన వీడలేదు. విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు సతమతమవుతోంది. చిన్న పార్టీల మద్దతు ఉందని చెబుతూ మూడు రోజుల్లో మూడుసార్లు గవర్నర్‌ను కలిసినా.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆ రాష్ట్ర లోక్‌భవన్ నుంచి పిలుపు రాకపోవడం తమిళ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. ఇదంతా కేవలం మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలు సమకూర్చడంలో చేస్తున్న జాప్యంగానే చయేడాలి.



## బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం

అశేషంగా హాజరైన ప్రజలకు అభివాదం



**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోయారు.

## ఇస్లామాబాద్ వేదికగా అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి చర్చలు

- రంగంలోకి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'
- యూఎన్ చీఫ్‌కు ఇరాన్ లేఖ
- ఉల్లంఘనలపై అమీర్ సయీద్ హెచ్చరిక!



**ఇస్లామాబాద్ / వాషింగ్టన్:** పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడమే లక్ష్యంగా కీలక ముందడుగు పడింది. ఓ ఒప్పందానికి సంబంధించి అమెరికా- ఇరాన్ మరోసారి చర్చలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ కు ఇరుదేశాల ప్రతినిధులు వచ్చేవారం రానున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. సంఘర్షణకు ముగింపు పలకడమే లక్ష్యంగా.. 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఆ కథనాలు వెల్లడించాయి. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమం, దానివద్ద ఉన్న యురేనియం నిల్వల బదిలీ, హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించడం వంటి కీలక విషయాలు ఉన్నాయి. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని టెహ్రాన్ ముందునుంచీ డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ చర్చలకు ఇవే అడ్డంకిగా మారాయి. కాగా.. చర్చలు సానుకూలంగా సాగితే ఇరుదేశాల మధ్య కొనసాగుతోన్న కాల్పుల విరమణ ఒప్పందం మరికొంతకాలం పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇక, పశ్చిమాసియా సంఘర్షణ ముగించేందుకు తాము పంపిన ప్రతిపాదనలపై ఇరాన్ నుంచి నేడు స్పందన వచ్చే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఈ విషయాన్ని సాగదీస్తుందా అని విలేకరులు అడగ్గా.. త్వరలోనే మనకు దీని గురించి తెలుస్తుందన్నారు. హర్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తిరిగి పునరుద్ధరించే విషయాన్ని తమ యంత్రాంగం పరిశీలిస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ త్వరగా ఒప్పందంపై సంతకం చేయకపోతే.. ఈ కార్యక్రమాన్ని 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'గా నిర్వహిస్తామన్నారు. నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పాటు మరికొన్ని చర్యలను కూడా చేపడతామన్నారు.

### అలా అయితే.. విపత్కర పరిణామాలు తప్పవు: ఇరాన్ హెచ్చరిక

అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్‌కు యూఎన్‌లోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ ఓ లేఖ రాశారు. ఇందులో హర్మూజ్ జలసంధిలో సైనిక చర్యలకు దిగి యూఎస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్‌లలో యూఎస్ తన సైనిక కార్యకలాపాలు కొనసాగిస్తే.. విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



## విజయ్‌కు లైన్ క్లియర్

మద్దతు లేఖ అందజేసిన వీసీకే

**చెన్నై:** విజయ్ టీవీకే ఎట్టకేలకు ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మార్క్ సాధించింది. టీవీకేకు బేషరతుగా తమ మద్దతును వీసీకే అధ్యక్షుడు తొల్ తురుమావళవన్ అధికారికంగా ప్రకటించారు. మద్దతు లేఖను స్వయంగా టీవీకేకు అందజేశారు. దీంతో తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటు కోసం అవసరమైన 118 మంది సభ్యుల సంఖ్యాబలం టీవీకేకు చేకూరింది. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో టీవీకే బలం 116కు చేరుకోవడం, మరో ఇద్దరు ఎమ్మెల్యేల బలం అవసరం కావడంతో శుక్రవారం రాత్రి నుంచి ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. దీనికి ముందు పూర్తి సంఖ్యా బలంతో తమ వద్దకు రావాలని గవర్నర్ ఆర్లేకర్ స్పష్టం చేయడంతో మూడు సార్లు గవర్నర్‌ను కలిసిన విజయ్‌కు నిరాశ ఎదురైంది. సంఖ్యాబలం నిరూపించుకోవడానికి ఈనెల 10 తేదీ గడువు కావడంతో ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలో వీసీకే మద్దతు అనివార్యమైంది. ఎట్టకేలకు బేషరుతుగా టీవీకేకు మద్దతిస్తున్నట్టు వీసీకే ప్రకటించడంతో విజయ్ పార్టీ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది.

### గవర్నర్‌ను కలవనున్న విజయ్

వీసీకే మద్దుతుతో మ్యాజిక్ ఫిగర్ సాధించిన విజయ్ నేరుగా గవర్నర్‌ను మరోసారి కలవనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతారు. గవర్నర్ నుంచి ఆహ్వానం అందగానే ఏమాత్రం జాప్యం లేకుండా ప్రమాణస్వీకారం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## మాజీ సీఎంగా పేరు మార్చుకున్న దీదీ

ఎక్స్ బయోను అప్‌డేట్ చేసిన మమత



**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమతా బెనర్జీ.. ఎట్టకేలకు తన పరాజయాన్ని అంగీకరించారు. రాష్ట్రంలో భాజపా సర్కారు కొలువుదీరిన నేపథ్యంలో.. ఆమె తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమత ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీఎం పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఆ తర్వాత మే 7వ తేదీతో అసెంబ్లీ గడువు పూర్తైన నేపథ్యంలో గవర్నర్ ఆర్ఎన్ రవి దానిని రద్దు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. నేడు రాష్ట్ర సీఎంగా భాజపా (నేత సువేందు అధికారి ప్రమాణం చేశారు. దీంతో దీదీ తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. 'అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి (15, 16, 17వ విధానసభ)' అని మార్చుకున్నారు. అంతకుముందు 'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి' అని మాత్రమే ఉండేది.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్

## మంత్రి పొంగులేటి

- క్లస్టర్ల వారీగా మూడు నెలల్లోపే దరఖాస్తుల పరిష్కారం
- త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితిలోపు పరిష్కరించేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మంత్రి పాల్గొన్నారు.

**14,700 దరఖాస్తులు - మెజారిటీ ఇందిరమ్మ ఇళ్ల కోసమే**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో 14,700 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనని పేర్కొన్నారు. "తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నాం. మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించాం" అని మంత్రి తెలిపారు.

**రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు:**

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

**ధరణి చిక్కుముడులకు 'భూ భారతి':**

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పుల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే, మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రతి గింజా కొంటాం - రైతుకు భరోసా:**

రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తామని తెలిపారు.

**"రైతును రాజును చేయడమే లక్ష్యంగా**

ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశాం. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ ఎంపిపి కొప్పుల అశోక్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# దోబి కార్మికురాలిని విధుల నుంచి తొలగించడం అన్యాయం

## చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్త కొండ శ్రీలక్ష్మి



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** గత 23 సంవత్సరాలుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దోబి వృత్తి చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్న దోబి కార్మికురాలు అక్కినపల్లి జానకి ని అకారణంగా విధుల నుంచి తొలగించడంతో ఆమె కుటుంబం రోడ్డున పడిందని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్త కొండ శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ఇందిరా పార్క్ లో విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సట్టు నాగయ్య తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మిషనరీ దోబి కాంట్రాక్ట్ ఫారుఖ్,ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రావణ్, ఆర్ఎం జనార్దన్ లు జానకి పై నోటికి వచ్చినట్లు దుర్భాషలాడుతూ ఆమెను విధుల నుంచి తొలగించడం అన్యాయం అన్నారు. రోగుల దుస్తులు, ఇతర రక్తపు మరకలు ఉన్న వస్త్రాలను ఉతికే జానకిని, ఎందుకు నన్ను తొలగించారని ఆమె అడగడంతో వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వారు బూతులు తిడుతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టర్, సూపరింటెండెంట్, ఆర్ఎంలు తమకు రాజకీయ అండ ఉందని తమను ఎవరు ఏం చేయలేరని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకొమ్మని బెదిరింపులకు దిగితున్నారని ఆరోపించారు.తక్షణమే దోబి కార్మికురాలు అక్కినపల్లి జానకి ని విధుల్లోకి తీసుకోవాలని లేదంటే తమ కులస్తులు లక్షల్లో ప్రభుత్వ ఆసుపత్రులను ముట్టడి చేస్తామని హెచ్చరించారు.అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో దోబి కాంట్రాక్ట్ లను చాకలి కులస్తులకు మాత్రమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాచకొండ గీత, మర్రిపల్లి స్వప్న,శ్రావణి,మర్రిపల్లి మల్సుర్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహా ప్రతిష్ట మహోత్సవాలు

**కీసర,రాజముద్ర న్యూస్:** రాంపల్లి దాయరలో వైభవంగా హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహా ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం టిటిడి దేవస్థానం ప్రధాన అర్చకులు పూజ్యశ్రీ వేణుగోపాల దీక్షితులు చేతుల మీదుగా శ్రీవారి యంత్ర, విగ్రహా ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ విగ్రహా ప్రతిష్టాపనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున సీఎం ముఖ్య సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామీణ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, హిందు ధర్మ ప్రచారకులు స్వామి రాధా మనోహర్ దాస్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్ రావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్, ములుగు జిల్లాల డిసిసి కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, అశోక్ తదితరులు స్వామి వారిని భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆహ్వానితులను ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి శాలువాలతో సత్కరించి, శ్రీవారి చిత్ర పటాలను బహుకరించారు.



# జనాభా లెక్కల స్వీయ గణన-2027 పై అవగాహన సదస్సు



## డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి

**నాగారం, రాజముద్ర న్యూస్:** ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ మారుతి గార్డెన్స్ లో శనివారం ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి ఆధ్వర్యంలో భారత్ జన గణన-2027 అవగాహన సదస్సును నిర్వహించినారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ లీడర్ జీవన్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం వివిధ కాలనీ వాసులు తమ కాలనీలో ఉన్న సమస్యల గురించి వినతి పత్రం రూపంలో డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తెల్ల శ్రీధర్, నాగారం రాంపల్లి అన్ని కాలనీల అధ్యక్షుడు వేణుగోపాలరావు, కాలనీల జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ రాజు, అన్ని కాలనీల కమిటీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ కాలనీల సంబంధించిన కాలనీ అధ్యక్షులు,సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సమ్మర్ క్లాసులు ప్రారంభం

## ఎంఈఓ ఆనందరావు




**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ప్రభుత్వ ఆదేశాలు అనుసారం మే 11 తేదీ నుండి మే 25వ తేదీ వరకు ఆరో తరగతి నుండి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ రామారెడ్డి మండలంలో ని రెడ్డి పెట్ గ్రామం హై స్కూల్ నందు నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి సమ్మర్ క్యాంపు నందు డ్రాయింగ్, కంప్యూటర్ ఎడ్యుకేషన్, యోగా, క్యారం, చెస్ మరియు క్రీడలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు క్యాంపు నిర్వహించడం జరుగుతుంది. కావున మండలంలో ఉన్న విద్యార్థులు క్యాంపును వినియోగించుకోగలరని ఎంఈఓ ఆనందరావు తెలిపారు.

# నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

## పాలేరు నియోజకవర్గంలో 4 మండలాలు మున్సిపాలిటీకి అధ్యక్షుల ఎంపిక




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోని పలు మండలాలకు నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం అధికారికంగా ప్రకటించింది.కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాలతో పాటు ఎదులాపురం మున్సిపాలిటీకి అధ్యక్షులను ఎంపిక చేశారు.

**నూతన అధ్యక్షులు**

కూసుమంచి మండలం:★ బజ్జూరి వెంకట్ రెడ్డి,తిరుమలాయపాలెం మండలం, కొప్పుల అశోక్నే,లకొండపల్లి మండలం కొడాలి గోవిందరావు,ఖమ్మం రూరల్ మండలం, తోట వీరభద్రం

**ఎదులాపురం మున్సిపాలిటీ, బానోత్ కిషోర్**

పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

**మంత్రికి కృతజ్ఞతలు:**

నూతనంగా నియామకమైన పార్టీ అధ్యక్షులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఎన్ క్యూ ఏ ఎస్ బృందం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం శనివారం రోజున డాక్టర్ జాశ్వ అభిషేక్ బండాలా, డాక్టర్ రాజేష్ మిశ్రా లు పరిశీలించారు. ఈ సందర్భంగా లేబర్ రూమ్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, ఓపీ విభాగం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల విభాగాలను బృందం పరిశీలించింది. తనిఖీల సందర్భంగా పీహెచ్‌సీలో ఉన్న కొన్ని లోపాలను అధికారులు గుర్తించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎం. సురేష్ మాట్లాడుతూ, తనిఖీ బృందం సూచించిన లోపాలను త్వరితగతిన సరిదిద్దుతూ సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. తనిఖీ తుది ఫలితాలు మరో ఒకటిన్నర నెలలో వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి ఎం హెచ్ ఓ డాక్టర్ రవీందర్ గౌడ్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విద్య, డాక్టర్ రోహిత్, డాక్టర్ రాజు గౌడ్, వైద్యాధికారులు డాక్టర్ యెమీమా, డాక్టర్ విజయమహాలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు అని వైద్యాధికారి సురేష్ తెలిపారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, రాములు, మేయర్ ధర్ని మధుకర్ తో కలిసి కొనుగోలు, రవాణా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పండే ధాన్యంలో 65 శాతం మంచిర్యాల నియోజకవర్గంలోనే వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 12 రైస్ మిల్లులు పనిచేస్తున్నాయని, ప్రతి మిల్లు రోజుకు కనీసం 10 లారీలకు తగ్గకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ నెల చివరి నాటికి 80 శాతం ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా విధించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాముల్లో నిల్వ చేయాలని, అవసరమైతే మరిన్ని కొత్త గోదాములను గుర్తించాలని అధికారులకు సూచించారు.

**ప్రణాళికాబద్ధంగా కొనుగోళ్లు - ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు...**

మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో వరి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కోరారు. దండేపల్లిలో 40 వేల ఎకరాలు, లక్షెట్టిపేటలో 28 వేల ఎకరాల్లో సాగు జరిగిందని, దానికి అనుగుణంగా లారీలు, హమాలీలను సమకూర్చుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు, లారీ అసోసియేషన్లకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో ఆర్డీఓ శ్రీనివాస్ రావు, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, లారీ అసోసియేషన్ సభ్యులు, ఐకేపీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీజీఎన్పీడీసీఎల్ 'ఏఐ' వాట్సాప్ చాట్‌బాట్ సేవలు ప్రారంభం

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** విద్యుత్ వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించేందుకు టీజీఎన్పీడీసీఎల్ కృత్రిమ మేధ ఆధారిత వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించింది. వినియోగదారులు 8712481489 నంబర్‌కు వాట్సాప్ చేయడం ద్వారా బిల్లు వివరాలు, చెల్లింపుల స్థితి మరియు విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల నమోదుకు కూడా ఈ చాట్‌బాట్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని, వినియోగదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.

## "విభజన హామీలు నెరవేర్చాకే మోదీ తెలంగాణలో అడుగు పెట్టాలి"

**దొంతరవేణి మహేష్ ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి**




**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు, బయారం స్టీల్ ప్లాంట్, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఆర్, ట్రైబల్ యూనివర్సిటీ వంటి అంశాలను నెరవేర్చకే ప్రధాని మోడీ తెలంగాణా లో అడుగు పెట్టాలని బహిరంగ లేఖ ను ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దొంతరవేణి మహేష్ విడుదల చేశారు.తెలంగాణకు న్యాయం చేయకుండా రాష్ట్రానికి వస్తున్నారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని లేని పక్షంలో పోరాడతమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోనగిరి శ్రవణ్, రొద్ద చరణ్,అంతటి సురేష్, వద్లురి మల్లేశం, కల్లూరి బాలమల్లు పాల్గొన్నారు.

## రైతులతో నీటిపారుదల శాఖ సమావేశం



**రాజముద్ర న్యూస్, బెజ్జంకి:** తెలంగాణలో రైతు వారోత్సవాల సందర్భంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో బెజ్జంకి మండలకేంద్రంలో రైతు వేదిక లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు సాగునీటి వినియోగం, పంటల నీటి నిర్వహణ, కాలువల సంరక్షణ, ప్రభుత్వం అమలు చేస్తున్న సాగునీటి పథకాలపై అవగాహన కల్పించారు. అధికారులు రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సంబంధిత అధికారులు డీఈ,మాజీ ఎంపీపీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి,పోతారం సర్పంచ్ రాజేందర్ రెడ్డి,నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పేదింటి సొంత కలను నెరవేరుస్తుంది

- ఒగ్గు దామోదర్ మాజీ ఎంపీపీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు
- ఇంటింటా ఇందిరమ్మ వెలుగులు



**రాజముద్ర న్యూస్, బెజ్జంకి :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తోందని మాజీ ఎంపీపీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ అన్నారు.ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మండలకేంద్రంలోని జడల కవిత-సంపత్ దంపతుల నూతన ఇందిరమ్మ గృహప్రవేశానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కళ నెరవేర్చుతుందని,కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే బడుగు బలహీనర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,టెంపుల్ కమిటీ మాజీ చైర్మన్ జెల్ల ప్రభాకర్,బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య,వార్డు సభ్యులు బొనగం రమేష్,ఎలిగే సతీష్, బైర సంతోష్,పర్మ నారాయణ రెడ్డి, ఐలేని మహేందర్ రెడ్డి,పొట్లపెల్లి ప్రభాకర్,గుబిరే చంద్రం,సంగెం మదు పాల్గొన్నారు.

# సార్లూ రారు... పర్యవేక్షణ చేయరూ

- ఎమ్మెల్యే ఆదేశించిన కానరాని ఫలితం
- మిల్లుల తీరుతో ఆందోళనలో రైతన్నలు



**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందుదామనుకుంటే తీరా పలు మిల్లులలో అదనపు తరుగుతో రైతులను దోపిడి చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని పలు మిల్లులో ఈ తతంగంతో రైతులు విసిగిపోయి రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా.. ఆ పాటికే సమఃస్యను పరిష్కరిస్తామని చెప్పి మళ్లీ పర్యవేక్షణ చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆయా గ్రామాల రైతులు బహిరంగంగా అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. దేశానికి రైతే రాజు...., రైతు దేశానికి వెన్నుముక.. అనే మాటలను అధికారులు, ప్రజాప్రతినిధులు సభలు, సమావేశాల సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నారు. కానీ రైతులకు న్యాయం చేయడానికి మాత్రం క్షేత్ర స్థాయిలో ఆ మాటలు కానరావడం లేదు. దీంతో పలు మిల్లర్ల తీరుతో రైతులు విసిగిపోతున్నారు. తమకు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరను పొందుదామనుకుంటే అధికారుల పర్యవేక్షణ లోపంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతుల సమస్యలు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి రావడంతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఓ సమావేశలో ఆయా మిల్లుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులకు సైతం రైతులకు ఇబ్బందులు పెట్టే మిల్లులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు సైతం ఇచ్చారు. కానీ క్షేత్ర స్థాయిలో నామమాత్రంగా అధికారుల పర్యవేక్షణ ఉండటంతో ముఖ్యంగా బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా మిల్లులతో అదనపు తరుగుతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉమ్మడి బీర్కూర్ మండలంలో ప్రతిఏటా రైతులు రోడ్డు ఎక్కి ధర్నాలు చేస్తున్నా.. ఆ ఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవడం విఫలమవుతూనే ఉన్నారు.

**న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నా రైతులు...?**

అదనపు తరగు విషయంలో ఆయా మిల్లుల తీరుతో బాధపడుతున్న రైతులు కొందరు న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. కేంద్రాలకు తెచ్చి మద్దతు ధరను పొందుదామనుకుంటే ఆయా బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా మిల్లుల తీరుపై న్యాయ పోరాటానికి రైతులు సిద్ధమవుతున్నారు. దీనికి అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రదాన కారణమని తెలుస్తుంది. ఎమ్మెల్యే ఆదేశాలను సైతం అధికారులు బేఖాతర్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అదనపు తరగు విషయంలో ఏది ఏమైనా రైతులకు న్యాయం చేసేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అవసరం ఏంతైనా ఉంది.

## ఇష్టపడి పనిచేస్తేనే గుర్తింపు



- ఎఫ్‌డీపీటీ శాంతారాం
- మంచిర్యాల డీఎఫ్ఓ శివ్ ఆశీష్ సింగ్‌కు ఘనంగా వీడ్కోలు
- శ్రీరాంపూర్ సింగరేణి గెస్ట్ హౌస్‌లో ఆత్మీయ సమావేశం
- కొత్త డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌కు సాదర స్వాగతం

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో కష్టపడి కాకుండా ఇష్టపడి పనిచేస్తేనే సమాజంలో గుర్తింపుతో పాటు ఆత్మతృప్తి లభిస్తుందని ఎఫ్‌డీపీటీ శాంతారాం అన్నారు. బదిలీపై మహబూబ్ నగర్‌కు వెళ్తున్న మంచిర్యాల జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) శివ్ ఆశీష్ సింగ్‌కు శనివారం శ్రీరాంపూర్ సింగరేణి గెస్ట్ హౌస్‌లో అటవీ శాఖ అధికారులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాంతారాం మాట్లాడుతూ.. ఉద్యోగ ప్రస్థానంలో బదిలీలు సహజమని, అందరినీ కలుపుకొని పోవడం వల్లే శివ్ ఆశీష్ సింగ్ జిల్లాలో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ పనిచేస్తున్నారని అభినందించారు. వీడ్కోలు అందుకున్న శివ్ ఆశీష్ సింగ్ మాట్లాడుతూ.. తన హయాంలో జిల్లాలో చేపట్టిన అటవీ అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన ఉన్నతాధికారులకు, సిబ్బందికి, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇదే వేదికపై కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌కు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల ఎఫ్‌డీఓలు, ఎఫ్ఆర్ఓలు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## లేబర్ కార్డు సేవలు వినియోగించుకోవాలి



**లేబర్ ఆఫీసర్ చందన్**

**రాజముద్ర న్యూస్, బోథ్:** లేబర్ కార్డు సేవలు ప్రతి ఒక్క కార్మికుడు వినియోగించుకోవాలని లేబర్ ఆఫీసర్ చందన్ అన్నారు ప్రజా పాలన 99 రోజుల్లో భాగంగా మే డే వారోత్సవాలు భాగంగా ఈ రోజు బోథ్ మండల కేంద్రంలోని మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కుట్టు మిషన్ కేంద్రం లో జరిగిన లేబర్ కార్డు అవగాహన కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ చందన్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు తీసుకోవాలని తెలిపారు తెలంగాణ ప్రభుత్వం లేబర్ కార్డు ద్వారా సహజ మరణం పొందిన కార్మికుడికి లక్ష నుండి రెండు లక్షలు పెంచారని మరియు ఏదైనా ప్రమాదం జరిగితే చికిత్స. కోసం ఆరు లక్షల మంది పది లక్షల వరకు సౌకర్యం చేశారని తెలిపారు కావున ప్రతి ఒక్కరు అర్హులు అయిన వారు లేబర్ కార్డు అప్లై చేయాలని మరియు రెన్యువల్ కాని వారు రెన్యువల్ చేపించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏటీసీ ఉపాధ్యాయుడు శివ మరియు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్,భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు చందు,కార్యదర్శి కరిపే శ్రీనివాస్ మరియు కార్మికులు పాల్గొన్నారు ప్రతి



## రౌడీషీటర్లకు పోలీస్ కౌన్సెలింగ్..

- డ్రగ్స్ పరీక్షలు నిర్వహణ
- నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు: ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్
- మంచిర్యాల ఆసుపత్రిలో రౌడీషీటర్లకు నార్కోటిక్ పరీక్షలు
- అందరికీ నెగటివ్ రావడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు

**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ ఇన్స్‌పెక్టర్ అశోక్ కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్ఐ సంతోష్‌తో కలిసి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ప్రవర్తనలో మార్పు రావాలని, పాత నేరాలను వదిలిపెట్టి బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. మనుషులను భయభ్రాంతులకు గురిచేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా రౌడీషీటర్లందరినీ మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి యూరిన్ నార్కోటిక్ డ్రగ్ పరీక్షలు చేయించారు. ఈ పరీక్షల్లో అందరికీ నెగటివ్ ఫలితాలు వచ్చినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. నేరాల నియంత్రణ కోసం పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని వెల్లడించారు.

## 11 నుండి 'విద్యా వారోత్సవాలు'.. విజయవంతం చేయండి

- సీఎస్ రామకృష్ణారావు
- బడిబాట, ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి
- రైతు నమోదు, జనగణన ప్రక్రియలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- వర్షా లకు ధాన్యం తడవకుండా చూడాలని కలెక్టర్లకు ఆదేశం



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా వారోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. విద్యా వారోత్సవాల్లో భాగంగా బడిబాట, తల్లిదండ్రుల సమావేశాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులకు శంకుస్థాపనలు చేయాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతిలో అనుత్తీర్ణులైన విద్యార్థుల కోసం ప్రత్యేక విద్యా శిబిరాలు నిర్వహించి వారిని ఉత్తీర్ణులయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

**తడిసిన ధాన్యంపై ప్రత్యేక నిఘా...**

అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, లారీలు మరియు హమాలీల కొరత లేకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రైతు నమోదు మరియు జనగణనలో భాగంగా స్వీయ గణన ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.

**జిల్లాలో సిద్ధంగా ఉన్న యంత్రాంగం - కలెక్టర్ కుమార్ దీపక్...**

సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేశామని తెలిపారు. 12 రైస్ మిల్లులు మరియు 6 గోదాములను ధాన్యం నిల్వకు కేటాయించినట్లు వివరించారు. ఈ నెల 11 నుండి ప్రారంభమయ్యే 'విద్యా వారోత్సవాలకు' అన్ని ఏర్పాట్లు చేశామని, అదే రోజు నుండి ఇండ్ల గణన ప్రక్రియను కూడా ఎన్యుమరేటర్ల ద్వారా చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రయ్య, రాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జైస్వాల్, షెఫాలీకి నాడా నోటీసుల కలకలం

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, మహిళా క్రికెటర్ షెఫాలీ వర్మ డోప్ టెస్టింగ్ నిబంధనల అంశంతో వార్తల్లో నిలిచారు. నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) 'వేర్ అబౌట్' క్లాజ్ ప్రకారం ఆటగాళ్లు తమ లొకేషన్ వివరాలు ముందుగానే ఇవ్వాల్సి ఉండగా.. నిర్దిష్ట సమయాల్లో టెస్టింగ్ అధికారులకు అందుబాటులో లేకపోవడంతో వీరిద్దరి పేర్లపై 'మిస్డ్ టెస్ట్' నమోదు అయినట్టు సమాచారం. యశస్వి జైస్వాల్ గత డిసెంబర్‌లో, షెఫాలీ వర్మ నవంబర్‌లో టెస్టింగ్‌కు అందుబాటులో లేరని తెలుస్తోంది. అనంతరం వివరణ కోరుతూ నాడా పంపిన నోటీసులకు స్పందన ఆలస్యమైనట్టు ప్రచారం సాగుతోంది. దీంతో తుది నోటీసులు జారీ చేసి సమాధానం కోరినట్టు సమాచారం. అయితే ప్రస్తుతం వీరిద్దరిపై ఎలాంటి నిషేధం వచ్చే పరిస్థితి లేదని క్రీడా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. నాడా, వాడా నిబంధనల ప్రకారం 12 నెలల్లో మూడుసార్లు టెస్టింగ్ మిస్ అయితేనే కఠిన చర్యలు ఉంటాయి. ప్రస్తుతం ఒక్కసారి మాత్రమే నమోదు కావడంతో తక్షణ ప్రమాదం లేకపోయినా.. ఈ వ్యవహారం భారత క్రికెట్‌లో చర్చనీయాంశంగా మారింది.



# లేడీ ఫ్యాన్ సెల్ఫీ కోసం వెయిట్ చేసిన రోహిత్

**హైదరాబాద్ :** ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తన సింప్లిసిటీతో అభిమానుల మనసు గెలుచుకున్నాడు. ఓ మహిళా అభిమాని సెల్ఫీ కోసం ప్రయత్నిస్తుండగా.. ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయినా రోహిత్ ఓపికగా ఎదురుచూసి చివరకు సెల్ఫీ ఇచ్చాడు. ఐపీఎల్ 2026 సందర్భంగా హోటల్ నుంచి టీమ్ బస్సులోకి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. సెక్యూరిటీ మధ్యలోనూ రోహిత్ అనుమతితో ఆ మహిళ ఆయన వద్దకు చేరుకుంది. అయితే ఫోన్ ఆఫ్ కావడంతో ఆమె కంగారు పడినా.. రోహిత్ తొందరపడకుండా వెయిట్ చేశాడు. టీమ్ బస్సు కదులుతున్న సమయంలో కూడా ఆమె పిలుపు విని డోర్ వద్ద ఆగి సెల్ఫీ ఇచ్చాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా.. అభిమానులు రోహిత్ సరళ స్వభావంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# సమీకరణాలు మార్చేసి..

## ప్లే ఆఫ్స్‌లోకి దూసుకొచ్చిన కేకేఆర్



**హైదరాబాద్ :** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుతమైన కమ్‌బ్యాక్‌తో ప్లే ఆఫ్స్ రేసును ఆసక్తికరంగా మార్చేసింది. తొలి ఆరు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా లేక తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న కేకేఆర్.. వరుసగా నాలుగు విజయాలతో ఒక్కసారిగా సమీకరణాలు మార్చి టాప్-4 పోరులోకి దూసుకొచ్చింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 8 వికెట్ల భారీ విజయంతో కేకేఆర్ తమ నెట్ రన్‌రేట్‌ను గణనీయంగా పెంచుకుంది. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, అనుకుల్ రాయ్ బౌలింగ్‌లో మెరిసితే.. ఫిన్ అలెన్ మెరుపు సెంచరీతో లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించాడు. ఈ విజయంతో కోల్‌కతా పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి చేరింది. సీజన్ ఆరంభంలో విమర్శలు ఎదుర్కొన్న కెప్టెన్ అజింక్య రహానే.. ఇప్పుడు జట్టును విజయపథంలో నడిపిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో గెలిస్తే కేకేఆర్ నేరుగా ప్లే ఆఫ్స్ చేరే అవకాశముంది. దీంతో ప్రతి మ్యాచ్ ఇప్పుడు కోల్‌కతాకు కీలకంగా మారింది. ఆర్సీబీతో మే 13న జరగనున్న మ్యాచ్ కేకేఆర్ భవితవ్యాన్ని మరింత ప్రభావితం చేయనుంది. వరుస విజయాలతో ఊపుమీదున్న కోల్‌కతా.. ఇదే జోరు కొనసాగిస్తే ప్లే ఆఫ్స్‌లో సంచలనం సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# టైటాన్స్ జైత్రయాత్ర!

## శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్ సుడిగాలి ఇన్నింగ్స్
## రాజస్థాన్ బౌలర్ల ఊచకోత.. 229 పరుగుల భారీ స్కోరు
## ఛేదనలో కుప్పకూలిన రాయల్స్.. 77 పరుగుల తేడాతో పరాజయం
## 4 వికెట్లతో గుజరాత్ విజయంలో కీ రోల్ పోషించిన రషీద్ ఖాన్
## వరుసగా 4వ మ్యాచ్ లో గెలిచి జోరుమీదున్న గుజరాత్ టైటాన్స్





**జైపూర్ :** ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. జైపూర్ లోని సవాయి మాన్ సింగ్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన మ్యాచ్ లో ఆతిథ్య రాజస్థాన్ రాయల్స్ పై గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించింది. బ్యాటింగ్ లో కెప్టెన్ శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్ సుడిగాలి ఇన్నింగ్స్ తో చెలరేగగా.. బౌలింగ్ లో రషీద్ ఖాన్ మాయాజాలంతో రాజస్థాన్ ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఫలితంగా 77 పరుగుల భారీ తేడాతో గుజరాత్ అద్భుత విజయాన్ని అందుకుని టోర్నీలో వరుసగా 4వ గెలుపును తన ఖాతాలో వేసుకుంది.

### రాయల్స్ బౌలర్ల ఊచకోత..

టాస్ గెలిచిన రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే గుజరాత్ ఓపెనర్లు శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్ ఆరంభం నుంచే రాయల్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. పవర్ ప్లే 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 82 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. సాయి సుదర్శన్ 36 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు చేసి ఔటవ్వగా.. శుభ్ మన్ గిల్ 44 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 84 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. జోస్ బట్లర్ 13 పరుగులకే వెనుదిరిగినా.. చివర్లో వాషింగ్టన్ సుందర్ (20 బంతుల్లో 37 నాటౌట్), రాహుల్ తెవాటియా (4 బంతుల్లో 14) దొరికిన బంతిని దొరికినట్లు బాదారు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో బ్రిజేష్ శర్మకు 2 వికెట్లు దక్కగా.. రవీంద్ర జడేజా, యశ్ పుంజా తలో వికెట్ పడగొట్టారు. జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్ పాండే భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

### రషీద్ స్పిన్ ఉచ్చులో రాజస్థాన్..

230 పరుగుల కష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఏ దశలోనూ విజయం వైపు సాగలేదు. ఆరంభంలోనే ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (16 బంతుల్లో 36), యశస్వి జైస్వాల్ (3) ఔటవడంతో రాయల్స్ కష్టాల్లో పడింది. కాసేపటికే హెట్ మెయర్ (6) కూడా పెవిలియన్ చేరాడు. ఈ దశలో రవీంద్ర జడేజా (25 బంతుల్లో 38), ధ్రువ్ జురెల్ (10 బంతుల్లో 24) ఇన్నింగ్స్ ను చక్కదిద్దే ప్రయత్నం చేసినా.. స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ వారి ఆశలపై నీళ్లు చల్లాడు. తన అద్భుతమైన స్పిన్ తో మిడిలార్డర్ ను కుప్పకూల్చాడు. జురెల్ తో పాటు శుభమ్ దూబే (15), జడేజా, డొనొవన్ ఫెరీరా (4) వికెట్లను పడగొట్టి మ్యాచ్ ను గుజరాత్ వైపు తిప్పాడు. రషీద్ ఖాన్ 4 ఓవర్లలో కేవలం 33 పరుగులిచ్చి 4 వికెట్లు తీయగా.. కగిసో రబాడ 33 పరుగులిచ్చి 2 వికెట్లు, జేసన్ హోల్డర్ 12 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి రాజస్థాన్ పతనాన్ని శాసించారు. మహ్మద్ సిరాజ్ కు 1 వికెట్ దక్కింది. దీంతో రాజస్థాన్ 16.3 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

# సచిన్‌తో పోల్చొద్దు

## వైభవ్‌పై జాదవ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ :** ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున సంచలన ప్రదర్శన చేస్తున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపై మాజీ క్రికెటర్ కేదార్ జాదవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌ను సచిన్ టెండూల్కర్‌తో పోల్చడాన్ని ఆయన తప్పుబట్టాడు. సచిన్ స్థాయిని ఎవరూ అందుకోలేరని, ఆయనతో యువ ఆటగాళ్లను పోల్చడం సరైనది కాదని స్పష్టం చేశాడు. సచిన్ టెండూల్కర్ కేవలం రికార్డుల ఆటగాడు మాత్రమే కాదని.. దశాబ్దాల పాటు భారత క్రికెట్‌కు అండగా నిలిచిన మహానుభావుడని జాదవ్ పేర్కొన్నాడు. 20 ఏళ్లకుపైగా ఒత్తిడిని తట్టుకుని కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచిన సచిన్‌తో ఎవరినీ తొందరగా పోల్చరాదని సూచించాడు. వైభవ్ సూర్యవంశీ ప్రతిభావంతుడని అంగీకరించిన జాదవ్.. ఇలాంటి పోలికలు యువ ఆటగాడిపై అనవసర ఒత్తిడిని పెంచుతాయని హెచ్చరించాడు. ప్రతి ఇన్నింగ్స్‌ను పరీక్షలా మార్చడం అతడి సహజ ఎదుగుదలకు ఆటంకమవుతుందని చెప్పాడు. సోషల్ మీడియా, మొబైల్‌కు దూరంగా ఉంటూ ఆటపై మాత్రమే దృష్టి పెట్టాలని వైభవ్‌కు సలహా ఇచ్చాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్ తరఫున అద్భుత ఫామ్‌లో ఉన్న వైభవ్.. 10 ఇన్నింగ్స్‌ల్లో 404 పరుగులతో ఆకట్టుకుంటున్నాడు. సెంచరీ, రెండు అర్ధ సెంచరీలతో పాటు 237కు పైగా స్ట్రైక్‌రేట్‌తో మెరిసిన ఈ యువ సంచలనం ఇప్పటికే భారత క్రికెట్ భవిష్యత్తుపై భారీ ఆశలు పెంచుతున్నాడు.

# ఒక్క సెంచరీ.. ఎన్నో రికార్డులు

**హైదరాబాద్:** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఓపెనర్ ఫిన్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో అరుదైన రికార్డులు సృష్టించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 47 బంతుల్లోనే శతకం బాది.. కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 5 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో నాటౌట్‌గా నిలిచిన అలెన్.. ఒక్క ఇన్నింగ్స్‌తోనే చరిత్రలో చోటు సంపాదించాడు. కేకేఆర్ తరఫున ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్ల జాబితాలో ఫిన్ అలెన్ మూడో స్థానానికి చేరాడు. బ్రెండన్ మెక్‌కల్లమ్ 13 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉండగా.. ఆండ్రీ రస్సెల్ 11 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇప్పుడు అలెన్ 10 సిక్సర్లతో ఈ ప్రత్యేక జాబితాలో చేరాడు. అంతేకాదు.. కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో సెంచరీ చేసిన అరుదైన బ్యాటర్లలో కూడా తన పేరు నమోదు చేసుకున్నాడు. మెక్‌కల్లమ్, వెంకటేష్ అయ్యర్, సునీల్ నరైన్ తర్వాత ఈ ఘనత సాధించిన ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు 2026లో మూడు టీ20 సెంచరీలు చేసిన తొలి న్యూజీలాండ్ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో బ్రెండన్ మెక్‌కల్లమ్ తర్వాత శతకం సాధించిన రెండో న్యూజీలాండ్ బ్యాటర్‌గా ఫిన్ అలెన్ ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఒక్క సెంచరీతో కేకేఆర్ చరిత్రలోనే కాకుండా న్యూజీలాండ్ క్రికెట్‌లోనూ తన పేరు బలంగా ముద్రించాడు.





# ‘స్పిరిట్’ కోసం ప్రభాస్ యాక్షన్ రెడీ

## పోలీస్ పాత్రకు ప్రత్యేక శిక్షణ.. భారీ ఫైట్ సీక్వెన్స్‌కు సిద్ధం

**హైదరాబాద్ :** ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘స్పిరిట్’ సినిమా కోసం ప్రభాస్ భారీ యాక్షన్ సన్నివేశాల రిహార్సల్స్‌లో పాల్గొంటున్నట్టు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుండటంతో యాక్షన్, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సమాచారం. కీలకమైన ఫైట్ సీన్ కోసం దాదాపు 100 మంది ఫైటర్లతో రిహార్సల్స్ జరుగుతున్నాయని, మే 10 నుంచి కొత్త షెడ్యూల్ ప్రారంభమయ్యే అవకాశముందని తెలుస్తోంది. పాత్ర కోసం ప్రభాస్ బరువు తగ్గి మరింత ఫిట్‌గా కనిపించనున్నారని టాక్. ఇందుకోసం కఠినమైన డైట్, వర్కౌట్ ప్లాన్‌ను అనుసరిస్తున్నారట. త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# రౌడీ జనార్ధన నుంచి రొమాంటిక్ పోస్టర్

## విజయ్ బర్త్‌డేకు స్పెషల్ ట్రీట్


**హైదరాబాద్ :** విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కుతున్న ‘రౌడీ జనార్ధన’ చిత్రం నుంచి ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ పాత్రను రొమాంటిక్ టచ్‌తో పరిచయం చేస్తూ సినిమాపై అంచనాలు పెంచేశారు. ‘ప్రపంచంతో పోరాడే వ్యక్తి.. కేవలం ప్రేమకు మాత్రమే లొంగిపోతాడు’ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన పోస్టర్‌లో విజయ్ స్టైల్, యాటిట్యూడ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. మాస్ ఇమేజ్‌కు ప్రేమను జోడిస్తూ దర్శకుడు పాత్రను డిజైన్ చేసిన తీరు ఆసక్తి రేపుతోంది. రవి కిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం మాస్, యాక్షన్, రొమాన్స్ మేళవింపుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. పోస్టర్ విడుదలతో సోషల్ మీడియాలో సినిమాపై చర్చ మరింత ఊపందుకుంది.




# ‘పెద్ది’ ట్రైలర్‌కు గ్రాండ్ ప్లాన్

## భోపాల్‌లో మే 16న భారీ ఈవెంట్?

## రెహమాన్ లైవ్ షోపై టాక్




**హైదరాబాద్ :** రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మల్టీ స్పోర్ట్స్ డ్రామా ‘పెద్ది’ ప్రమోషన్స్ జోరందుకున్నాయి. జూన్ 4న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను మే 16న గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్వహించే అవకాశముందని సమాచారం. రామ్ చరణ్, జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సహా చిత్ర యూనిట్ ఈ వేడుకలో పాల్గొననున్నట్టు టాక్. నార్త్ ఇండియా మార్కెట్‌పై ఫోకస్‌తో ఈ లొకేషన్ ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. కేవలం ట్రైలర్ విడుదల కార్యక్రమంగా కాకుండా.. మ్యూజికల్ ఫెస్టివల్ తరహాలో ఈ ఈవెంట్‌ను నిర్వహించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. ఇందులో సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్ కూడా ఉండొచ్చన్న ప్రచారం మరింత ఆసక్తి పెంచుతోంది. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ‘పెద్ది’పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ట్రైలర్‌తో సినిమా హైప్ మరింత పెరిగే అవకాశముందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ట్రైలర్ డేట్, ఈవెంట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# స్పోర్ట్స్ వేర్‌లో సెగలు రేపుతున్న నభా

## ఫిట్‌నెస్‌తో పాటు గ్లామర్ షో..

టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ తాజా జిమ్ ఫోటోలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. స్పోర్ట్స్ వేర్‌లో స్టైలిష్‌గా మెరిసిన నభా.. ఫిట్‌నెస్‌తో పాటు గ్లామర్ టచ్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. పౌడర్ బ్లూ స్పోర్ట్స్ బ్రా, హై వెయిస్ట్ లెగ్గింగ్స్‌లో నభా ఫిట్ అండ్ ఫ్యాషనబుల్ లుక్‌లో కనిపించింది. జిమ్‌లోని ప్రత్యేక లైటింగ్ మధ్య ఆమె స్టైల్ మరింత హైలైట్ అయింది. ట్రెండీ యాక్సెసరీస్, స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో నభా తన ఫిట్‌నెస్ ఫోటోలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. నభా లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఫిట్‌నెస్, ఫ్యాషన్ కలయికలో నభా మరోసారి తన ప్రత్యేకత చాటుకుంది.



# బోల్డ్ లుక్‌లో భాగ్యశ్రీ బోర్సే

## గ్లామర్‌తో మెరిసిన యంగ్ బ్యూటీ

**హైదరాబాద్ :** యంగ్ హీరోయిన్ భాగ్య శ్రీ బోర్సే బర్త్‌డే సందర్భంగా ఆమె నటిస్తున్న తమిళ చిత్రం ‘సేయోన్’ నుంచి మేకర్స్ స్పెషల్ ఫస్ట్‌లుక్ పోస్టర్లను విడుదల చేశారు. శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో భాగ్య శ్రీ కొత్త లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు ‘లెనిన్’ టీమ్ కూడా ప్రత్యేక పోస్టర్ విడుదల చేయడంతో అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. తాజాగా భాగ్య శ్రీ చాక్లెట్ బ్రౌన్ సీక్విన్ గౌన్‌లో గ్లామర్ టచ్‌తో ఆకట్టుకుంది. స్టైలిష్ అవుట్‌ఫిట్, సింపుల్ జ్యువెలరీ, వేవీ హెయిర్‌తో ఆమె లుక్ ప్రత్యేకంగా నిలిచింది. ఈ బర్త్‌డే పోస్టర్లు ప్రస్తుతం సోషల్ మీడియాలో భాగ్య శ్రీకు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com